ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు'

- నిడమర్రులో పర్యటించిన ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు
- గాలాయగూడెంలో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి


నిడమర్రులో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


గాలాయగూడెంలో ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

నిడమర్రు : రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల అమలు తీరుని పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తెలిపారు. గురువారం సాయంత్రం నిడమర్రులో మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ ఆధ్వర్యంలో 161 రోజుకు చేరుకున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుబాబు పాల్గొన్నారు. ఆయనకు పలువురు లబ్ధిదారులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ నాలుగేళ్లుగా రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రం దివాళా తీస్తుందని, ఆర్థిక వ్యవస్థ పతనమవుతోందని అంటూ చంద్రబాబు, ఎల్లోమీడియా అనేక ఆరోపణలు చేశాయని, కాని జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనే ఇటీవల మహానాడులో పేర్లు మార్చి చంద్రబాబు మేనిఫెస్టోగా ప్రకటించడం విడ్డూరమన్నారు. అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోలను పక్కన పెట్టే ఘనత చంద్రబాబుకు ఉంటే, ఎన్నికల ముందు ప్రకటించిన మెనిఫెస్టోను నూరుశాతం అమలుకు కృషి చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అనే విషయం రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు. అధికారం కోసం చంద్రబాబు అన్ని పార్టీల మేనిఫెస్టోలు కాపీ కొట్టి, అధికారం వచ్చాక వాటిని చిత్తుకాగితాలకే పరిమితం చేస్తారన్నారు.

ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం జగన్

ముఖ్యమంత్రిగా జగనన్న ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసేలా కృషి చేశారన్నారు. గత నాలుగేళ్లలో రెండేళ్ల కరోనా మహమ్మారితో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపినా నవరత్నాల్లో ఏ పథకాన్ని ప్రజలకు దూరం చేయలేదన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజలు వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో పట్టం కట్టాలని కోరారు. ఈ సందర్భంగా 160 వరకూ గడపల వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. అలాగే వారు చెప్పిన సమస్యలు తక్షణం పరిష్కరించేలా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గుడిసే జాన్‌బాబు, సర్పంచ్ పాట్నూరి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు దూసనపూడి సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ పోలిశెట్టి రమేష్, ఉప సర్పంచ్ పోలిశెట్టి మురళి, నీటి సంఘం అధ్యక్షుడు మండ పోలయ్య, కన్నాజీ బాలాజీ, చలంశెట్టి బాబులు, దూలం ధాత్రిరావు, ఎలిశెట్టి మురళి, నడిమింటి వెంకటేష్, వగ్వాల రాధాకృష్ణ, రుద్ర సుబ్బారావు, కన్నాజి రామకృష్ణ, సూతాని యోసు, పేరిచర్ల రాంబాబు అంబళ్ల శ్రీను, పతివాడ శ్రీను తదితరులున్నారు.

నేడు నిడమర్రులో గడప గడపకు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం 162వ రోజు నిడమర్రు గ్రామంలో శుక్రవారం సాయంత్రం 4.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పల్లె ప్రాంతాల్లోనూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

దెందులూరు : పట్టణాలకు దీటుగా ప్రతి పల్లె శివారు ప్రాంతాల్లో నవరత్నాల పథకాల అమలుతో పాటు అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యత అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకోవడమే కాకుండా అవి పరిష్కారమయ్యేవరకు పూర్తి జవాబుదారీతనంతో రికార్డుల నిర్వహణ, పర్యవేక్షణ అధికారులతో సమీక్ష చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారు. గతంలో దేశంలోనే ఎన్నడూ లేని విధంగా పేద, బడుగు, బలహీన, మైనార్టీ, దళిత, గిరిజన వర్గాల అభ్యున్నతి, సమస్యల పరిష్కారం, జీవన విధానం మెరుగు పరిచే దిశగా ప్రజాప్రతినిధులు నేరుగా ప్రతి ఇంటికి వెళ్లి సమస్యను తెలుసుకుని పరిష్కారం చేయడం ఏపీలో మాత్రమే జరుగుతుందని ఆయన అన్నారు. గురువారం పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సొసైటీ అధ్యక్షుడు తోట అచ్చియ్య, గ్రామ సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం ఆధ్వర్యంలో గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైద్యం, ఇంటి స్థలం, డ్రెయినేజీ, రోడ్లు, విద్యుత్, రుణాలు, ఇతర సమస్యలకు సంబంధించి ప్రజలు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి వినతిపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల ఉద్యోగులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందడం, సమస్యలుంటే పరిష్కరించడం, ఉద్యోగులందరీ ఏకైక అజెండాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, సానిగూడెం సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), పార్టీ నాయకులు బోయపాటి గణేష్, ముసునూరి వెంకటేశ్వరరావు, తోట వెంకన్న, పెద్దిశెట్టి బసవయ్య, వార్డు మెంబర్లు శ్రీధర్, రాజేష్, వలంటీర్లు, ఉద్యోగులు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం


రావులపర్రులో విగ్రహ ప్రతిష్ఠ పూజలు జరుపుతున్న దృశ్యం

ఉంగుటూరు : రావులపర్రు గ్రామంలో మహాలక్ష్మి, కట్లమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోపూజ, వేదస్వస్తి, స్నపనం, ఆలయ ప్రదక్షిత తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అగ్ని సంరక్షణ, నవ కలశ స్థాపన, ధ్వజారోహణం కార్యక్రమాలు జరిపారు. భక్తుల నామ స్మరణ నడుమ గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శనివారం విగ్రహ ప్రతిష్ఠ జరుపనున్నారు.

అల్లం.. ధర ప్రియం



గణపవరం : అల్లం ఘాటెక్కింది. పది రోజులుగా అల్లం ధరలకు రెక్కలొచ్చాయి. నిత్యావసరమైన అల్లాన్ని సామాన్యుడు కొనలేని స్థితికి చేరింది. ప్రస్తుతం మార్కెట్లో అల్లం కిలో రూ.300 పలుకుతుంది. ఏనాడు రూ.150కు మించని అల్లం ధర ఒక్కసారిగా రెట్టింపవడంతో ప్రజలు దీని వినియోగం కూడా సగానికి సగం తగ్గించేశారు. ఒకవైపు శుభకార్యాలు, మరోవైపు పచ్చళ్ల సీజన్ కావడంతో అల్లానికి డిమాండ్ పెరిగింది. అయితే డిమాండ్‌కు సరిపడ సప్లయి, ఉత్పత్తి లేకపోవడంతోనే అల్లం ధరకు రెక్కలొచ్చాయని వ్యాపారులంటున్నారు. గతనెలలో కిలో రూ.150 పలికిన అల్లంధర, ఇరవై రోజుల క్రితం వరకూ పెరుగుతూ కిలో రూ.250కు చేరి, ప్రస్తుతం రూ.300 పలుకుతోంది. హోల్‌సేల్ మార్కెట్లో సైతం కిలో రూ.260 పలుకుతోంది. అల్లం ధర ప్రియం కావడంతో ఆచితూచి వాడుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ధర మరో నెలరోజుల వరకూ ఇలాగే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

దెందులూరు ఈఓఆర్‌డీగా తిరుపతి స్వామి



దెందులూరు : దెందులూరు మండల పంచాయతీ విస్తరణాధికారి (ఈఓఆర్‌డీ)గా టి.నర్సాపురం మండలం ఈఓఆర్‌డీ ఎన్. తిరుపతి స్వామిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు దెందులూరు ఈఓఆర్‌డీ పోస్టు ఖాళీగా ఉంది. మండలంలోని గాలాయగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఉంగుటూరు నుంచి ఏ. స్వరాజ్యలక్ష్మి బదిలీపై వచ్చారు. గాలాయగూడెం కార్యదర్శి పోస్టు కూడా ఇప్పటివరకు ఖాళీగానే ఉంది.

నేడు లక్ష్మీపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి : లక్ష్మీపురంలో శుక్రవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్ చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ కోత వేళలు

పెదపాడు : మండలంలోని ఏపూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అప్పనవీడు, తాళ్లమూడి, ఏపూరు పరిసర ప్రాంతాల్లో లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శశిధర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మహిళను కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళను కొట్టి గాయపర్చిన నేరంపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని మైసన్నగూడెంకు చెందిన వల్లూరి లక్ష్మీకుమారికి ముగ్గురు మగసంతానం. ఆమె చిన్నకుమారుడు వల్లూరి దుర్గాప్రసాద్‌కు వివాహమై ఇద్దరు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. మే 31వ తేదీన లక్ష్మీకుమారి చిన్న కోడలు తండ్రి అయిన ఉండ్రాజవరపు దుర్గయ్య సదరు ఆడపిల్లల విషయంలో లక్ష్మీకుమారితో గొడవపడి కిందపడవేశాడన్నారు. అతని వెంటే ఉన్న తగరం పుల్లయ్య అనే వ్యక్తి కర్రతో లక్ష్మీకుమారిని తీవ్రంగా గాయపర్చాడన్నారు. గాయపడిన లక్ష్మీకుమారి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందిందని, ఆ మేరకు లక్ష్మీకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు


దెందులూరులో పత్రికా పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి ఝాన్సీ


భీమడోలులో నీతికథలు చెబుతున్న బాలుడు

దెందులూరు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని దెందులూరు గ్రంథాలయాధికారి ఝాన్సీ అన్నారు. గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో దెందులూరు గ్రంథాలయంలో చిన్నారులకు, వారి కుటుంబసభ్యులకు పత్రిక, పుస్తక పఠనం, చెస్, కంప్యూటర్, జాతీయ నాయకుల త్యాగాలు, వారి జీవన విధానాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా కల్పిస్తున్న అవకాశాలను చిన్నారులు లబ్ధి పొందేలా సహకరించాలని ఝాన్సీ కోరారు.

భీమడోలు : వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం భీమడోలు గ్రంథాలయంలో గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిసోర్స్‌పర్సన్, హెచ్‌ఎం మండే సుధాకర్ చిన్నారులకు నీతి కథలు వల్లించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు వేసవి శిక్షణా తరగతులు దోహద పడతాయన్నారు. తెలుగు, ఇంగ్లిషు పుస్తకాలను చదవించడంతో పాటు వాటిలో కఠిన పదాలను సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం చిన్నారులు కేరమ్స్, చదరంగం తదితర ఆటలు ఆడారు. బాలుడు వికాస్ నీతి కథలను వివరించగా, రాగదీపిక పేపర్ క్రాఫ్ట్స్‌పై తోటి చిన్నారులకు వివరించింది. గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్ జి.నాగమణి, పెద్దలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పెదపాడు : పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులలో భాగంగా గురువారం విద్యార్థులచే నీతికథలు చదివించారు. వీటితోపాటు స్వామి వివేకానంద జీవిత చరిత్రను వివరించారు. అనంతరం కంప్యూటర్, చెస్, కేరమ్స్‌పై శిక్షణ అందించినట్లు గ్రంథాలయాధికారి చెప్పారు.

పల్లె పయనం పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు : రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలిమేర హరికృష్ణ పల్లె పయనం పేరుతో ముద్రించిన పోస్టర్లను గురువారం దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల పిల్లలు ఆర్థికంగా వెనుకబడి సాధారణ, ఉన్నత విద్యలకు దూరంగా ఉంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న అనేక విద్యా పథకాలను అందిపుచ్చుకుని ప్రతి ఇంటిలోనూ చిన్నారులను తల్లిదండ్రులు విధిగా పాఠశాలలకు పంపి తమ బిడ్డలను చదవించాలన్నారు. పాలిమేర హరికృష్ణ మాట్లాడుతూ పేదవర్గాల చిన్నారులంతా బాలకార్మికులుగా, కూలీలుగా మారి వారి బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, పల్లె పయనం పేరుతో విద్యాభివృద్ధి, విద్య ఆవశ్యకతపై వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, దళిత పెద్దలు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు పేదలకు వరం


పిప్పరలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం : గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలు, వృద్ధులకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం వరమని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని గణపవరం మండలం పిప్పర సర్పంచ్ కాకర బేబీ అన్నారు. గురువారం గ్రామ సచివాలయంలో వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం గురించి వైద్య సిబ్బంది ప్రజలకు వివరించారు. ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 55 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు అవసరమని, వీటిని త్వరలోనే ఉచితంగా అందచేస్తామని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఉప సర్పంచ్ ఐవి రాజు, వైఎస్సార్ టీఎఫ్ నాయకుడు కాకర శ్యాంసన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భానుడి భగభగలు


నిర్మానుష్యంగా గుండుగొలను - కొవ్వూరు బైపాస్ రోడ్డు

భీమడోలు : ఎండల తీవ్రతతో జనం అల్లాడిపోతున్నారు. మండే ఎండలతో వాతావరణం నిప్పుల కొలిమిగా మారింది. మండల వ్యాప్తంగా గురువారం 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే ప్రచండ భానుడు నిప్పులు కక్కుతుండడంతో జనం రోడ్లపైకి వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. దీనితో సాయంత్రం 5 గంటల వరకు వేడి గాలులు తగ్గడం లేదు. దీంతో జనసంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య శాఖ విస్తృత ప్రచారం చేస్తుంది. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, తప్పనిసరి పరిస్థితుతల్లో వెళ్లాల్సి వస్తే గొడుగు, ముఖానికి మాస్కులను ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎండలు, ఉక్కపోతతో ఆపసోపాలు

ఉంగుటూరు : ఎండలు తీవ్రంగా కాస్తుండటం, ఉక్కపోతతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. రెండురోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఎండల ధాటికి మధ్యాహ్నం జాతీయరహదారి సైతం నిర్మానుష్యంగా మారుతోంది. ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో వ్యవసాయ పనులకు వెళుతున్న రైతులు, ఉపాధి కూలీలు వేకువజామున పనులకు వెళ్లి త్వరగా పనులు ముగించుకుని ఇంటికి చేరుకుంటున్నారు. ప్రస్తుతం సార్వా పనుల నేపథ్యంలో నారుమళ్లు పోస్తున్నారు. డెల్టాలో నీటి వసతి ఉన్న చోట నారుమళ్ల పనులు సాగిస్తున్నారు. మెట్టప్రాంతంలో అయితే బోర్ల వద్ద నారుమళ్లు ఇప్పటికే పూర్తిచేశారు.

ఎంపీడీవోగా రాజ్‌మనోజ్ పూర్తి బాధ్యతల స్వీకరణ

పెదవేగి : ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న గంజి రాజ్‌మనోజ్ గురువారం పెదవేగి ఎంపీడీవోగా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంపీపీ తాతా రమ్యకుమార్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. గ్రామాల్లో ప్రజలకు మరింత చేరువలో ఉండి సేవలు అందించాలని ఆకాంక్షించారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కూరపాటి విక్టర్ జాన్సన్, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు, పెదవేగి పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్, కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ మాదు రామకృష్ణ తదితరులు ఎంపీడీవో రాజ్‌మనోజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

ఉంగుటూరు : ఉంగుటూరు గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి గిరిధర్ వెల్లడించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆప్తామాలజిస్టు వచ్చి పరీక్షలు చేస్తారని, గ్రామంలో 60 ఏళ్లు నిండిన వారు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అలాగే గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు, దోమల లార్వా పెరగకుండా చేస్తున్న కృషిని కార్యదర్శి వివరించారు. ఉపసర్పంచ్ పాతూరి జగదీష్, వార్డు మెంబర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై డీపీఓ జోక్యం చేసుకోవాలి

ఏఎంసీ డైరెక్టర్ శ్యామలాదేవి డిమాండ్

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీలో పన్నుల వసూళ్లపై జిల్లా పంచాయతీ అధికారి జోక్యం చేసుకోవాలని దెందులూరు ఏఎంసీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నేత పులిపాటి శ్యామలాదేవి డిమాండ్ చేశారు. గురువారం దెందులూరులో ఆమె మాట్లాడుతూ పంచాయతీకి సంబంధం లేని, జిల్లా అధికారులతో నియామకం కాని వ్యక్తి గ్రామ పంచాయతీ పన్నుల వసూళ్లకు పంచాయతీ ఉద్యోగులతో కలిసి వెళ్తున్నారని, ఈ విషయంపై ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి యోహోషువాను తాను అడిగానన్నారు. గ్రామ పంచాయతీ పన్నుల వసూళ్లకు ఏ వ్యక్తిని నియమించలేదని సమాధానం ఇచ్చారన్నారు. ప్రైవేటు వ్యక్తి పన్నుల వసూళ్లకు ఎలా వెళ్తారని, జిల్లా అధికారులు ఈ విషయంపై వెంటనే స్పందించి విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

పెడన మున్సిపల్ కమిషనర్‌గా మహేంద్ర

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోన్న బంటుమిల్లి మహేంద్రను కృష్ణాజిల్లా పెడన పురపాలక సంఘానికి కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఏలూరు నగరంలో విశేష సేవలు అందిస్తూనే, మరోవైపు తన ఉద్యోగంలో పదోన్నతి పొందేందుకు ఆయన డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాస్తూ విజయం సాధించారు. ఒకవైపు సర్వీసులో సీనియార్టీ సాధించటం, మరోవైపు ఉన్నత విద్యను అభ్యసించటం ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ నుంచి మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందటం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించేలా కృషి చేస్తానని చెప్పారు. చిన్నపాటి ఉద్యోగంలో చేరి నేడు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషాన్నిస్తుందన్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం


కాశిపాడులో మలేరియా వ్యతిరేక ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం : దోమల నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని గణపవరం, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు అన్నారు. గురువారం కాశిపాడు గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు పరిశుభ్రత, అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీతో పాటు అనేక రకాల అంటు వ్యాధులకు మూలం అపరిశుభ్రత, దోమలేనని, దోమల నిర్మూలనతో అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని అవగాహన కల్పించారు. గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాలలో వైద్య సిబ్బంది వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు, దోమల వ్యాప్తి , నివారణ, అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంట్లుతోముకునే ప్రదేశాలలో నీరు నిల్వ ఉండటం వల్ల వాటిలో దోమలు వృద్ధి చెందుతాయని అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సహాయకులు నామాలరాజు మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 1వతేదీ నుంచి 30వ తేదీ వరకూ మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

4న 'గ్రూప్స్' అభ్యర్థులకు అవగాహన సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోయే గ్రూప్-1, గ్రూప్ -2 పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థుల కోసం అమిగోస్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో ఉన్న తమ అకాడమీలో ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతుందన్నారు. ఈ సదస్సు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇతర వివరాల కోసం 04035052121, 9000230734 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

మలేరియా జ్వరాలపై అశ్రద్ధ వద్దు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆశ

ఏలూరు టౌన్: మలేరియా జ్వరాలు పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డీ.ఆశ, జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా బ్యానర్‌ను గురువారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మలేరియా జ్వరాలు ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ఉన్నాయనీ, ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో అత్యధికంగా మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. మలేరియా జ్వరాలను అశ్రద్ధ చేస్తే మరణాలు సంభవిస్తాయని, మలేరియా జ్వరాన్ని చలి జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. మలేరియా కారక దోమ ఆడ అనాఫిలిస్ ఇంటిలోపల ఇంటి బయట ఉండే మంచినీటి నిలువ ప్రాంతాల్లో పెరుగుతాయని తెలిపారు. ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాలైన నీళ్ల తొట్లు కడిగి మూతలు పెట్టుకోవాలనీ, రుబ్బురోళ్లు, డ్రమ్ములు నిత్యం శుభ్రం చేసుకోవాలన్నారు.జూన్ నెలంతా పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలోనూ విస్తృతస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మలేరియా చాలావరకు తగ్గుముఖం పట్టిందనీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా పరీక్షలు ఉచితంగా చేస్తారనీ, మందులు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రత్నకుమారి, ఏవో మురళీకృష్ణ, డీపీహెచ్ఎన్‌వో మనోరమ, డెమో నాగరత్నం, విజయ్, అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు సిబ్బంది ఉన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

దెందులూరు, ఉంగుటూరు

9912220559

90102 23729

63097 62918

Office mail : tpgadvt@gmail.com